క్లుప్తంగా

15 ఏళ్లుగా బోర్డుకే పరిమితం



డీవీ సత్రంలో యార్డుకు కేటాయించిన స్థలంలో ఉన్న బోర్డు

దొరవారిసత్రం : మండల కేంద్రమైన దొరవారి సత్రం ప్రాంతంలో మార్కెటింగ్ యార్డు నిర్మాణం 15 ఏళ్లుగా బోర్డుకే పరిమితమైంది. అప్పట్లో మార్కెట్ యార్డు నిర్మాణం కోసం రహదారి వెంబడే ఉన్న 5 ఎకరాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు కేటాయించి సూళ్లూరుపేట సబ్ మార్కెటింగ్ శాఖకు అప్పగించారు. అప్పుడు వేసిన యార్డు నిర్మాణం బోర్డు నేటికి అలాగే ఉంది. ఈ ప్రాంతంలో యార్డును నిర్మించకపోయినప్పటికీ బోర్డుకు మాత్రం అప్పుడప్పుడు రంగులు వేసి ఉంచుతున్నారు. మార్కెట్ యార్డు నిర్మాణం రైతులకు కలగానే మిగిలింది.

విద్యార్థి వైద్య ఖర్చులకు రూ.40 వేల సాయం



నగదు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు,

గూడూరు రూరల్ : ఓజిలి మండలం పెద పరియ గ్రామానికి చెందిన బీటెక్ చదివే విద్యార్థి వైద్య ఖర్చుల కోసం లయన్స్ క్లబ్ సభ్యులు రూ.40 వేల సాయం అందించారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ పెదపరియకు చెందిన బస్సారెడ్డి రేవంత్ రెడ్డి అనే విద్యార్థి ఇటీవల చెట్టు పైనుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడని తెలిపారు. అతని వైద్య ఖర్చులకు సహాయం చేయాలని కోరడంతో లయన్స్ క్లబ్ ద్వారా రూ.20 వేలు, క్లబ్ సభ్యులు జక్కంరెడ్డి శ్రీనివాసులురెడ్డి రూ.20 వేలు అందజేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు రవిచంద్ర, డిస్ట్రిక్ట్ చైర్మన్ మల్లెమాల మురళీరెడ్డి, వాకాటి రామోహన్‌రావు, క్లబ్ సభ్యులు మదనంబేటి రమణయ్య, కళ్యాణ సాయి, రూపేష్‌రెడ్డి, వీరేంద్రనాథ్ పాల్గొన్నారు.

రోడ్డు పక్కకు ఒరిగిన బస్సు



చెరువు కలుజు వద్ద అదుపు తప్పి ఒరిగి పోయిన బస్సు

చిట్టమూరు(చిల్లకూరు) : చిట్టమూరు మండలం తాడిమేడు సమీపంలో సోమవారం వేకువజామున త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం మేరకు.. నాయుడుపేట మండ లం మేనకూరు గ్రామంలోని ఓ పరిశ్రమకు చెందిన బస్సు అందులో పనిచేసే ఉద్యోగులను తీసుకువెళ్లేందుకు ప్రతి రోజూ వస్తుంది. తాడిమేడు మీదుగా ఆరూరు, అరవపాళెం, తాడి మేడు గ్రామాల్లోని కార్మికులను ఎక్కించుకుని తీసుకెళుతుంది. సోమవారం తెల్లవారుజామున బస్సు తాడిమేడు చెరువు కలుజు వద్దకు వచ్చే సరికి డ్రైవర్ కునుకుతీశాడు. దీంతో బస్సు అదుపు తప్పి కల్వర్టు పక్కకు ఒరిగిపోయింది. బస్సును నిలిపి వేసి పరిశ్రమకు సమాచారం అందించాడు. అదే బస్సులో కార్మికులను తీసుకుని వచ్చే సమయంలో బస్సు అదుపు తప్పి ఉంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు.


117 జీవోను రద్దు చేయాలి



యూటీఎఫ్ సభ్యత్వం నమోదు కార్యక్రమంలో నాయకులు

రాపూరు : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన మాట ప్రకారం జీవో నంబర్ 117ను రద్దు చేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా నాయకులు హరిప్రసాద్‌రెడ్డి కోరారు. ఆయన సోమవారం వేపినాపి, కండలేరు డ్యామ్ కాంప్లెక్ పరిధిలో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా డిసెంబర్‌లో స్వర్ణోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు వెంకటేశ్వర్లు, అంకయ్య, బాలప్రసాద్, రవికాంత్, శ్రీనివాసులు, శివసాయి, నాదానందరావుపాల్గొన్నారు.

డీవీ సత్రంలో భారీ వర్షం



ఆకాశంలో కమ్ముకున్న మబ్బులు

దొరవారిసత్రం : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి అంతా భారీ వర్షం కురిసింది. డీవీ సత్రం, అక్కరపాక, ఎస్ఎం అగ్రహారం, నెలబల్లి, నెల్లూరుపల్లి, మైలాంగం తదితర గ్రామాల్లో భారీ వర్షం కురవడంతో చెరువుల్లోకి కొంత నీరు చేరింది. సోమవారం ఆకాశం మేఘావృతమై చల్లటి గాలులు వీచాయి.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి



చిల్లకూరు : మాట్లాడుతున్న వరగలి వైద్యులు గీతామణి

సూళ్లూరుపేట రూరల్ : గ్రామాల్లో డయేరియా ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో చంద్రమౌళి ఆదేశించారు. ఆయన సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎస్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేపట్టాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను మండల వైద్యాధికారి రమణయ్య వివరించారు. డీఎల్‌పీవో రవీంద్రకుమార్, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన

సైదాపురం: ఎంపీడీవో సుధాకర్ సోమవారం స్థానిక స్త్రీశక్తి కార్యాలయంలో పలు శాఖల అధికారులతో డయేరియాపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి ప్రజలకు డయేరియాపై అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు డయేరియా గురించి వివరించాలన్నారు. పరిసరాల శుభ్రత పాటించాలని, చేతులను శుభ్రంగా కడుగుకోవాలని సూచించారు. ఎక్కడైనా డయేరియా లక్షణాలు ఉంటే వెంటనే ఆరోగ్య కేంద్రానికి సమాచారం ఇవ్వాలన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు వేగవంతం

బాలాయపల్లి(సైదాపురం) : గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో అరుణ ఆదేశించారు. ఆమె సోమవారం స్త్రీ శక్తి భవనంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, మండల స్థాయి అధికారులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో డయేరియా ప్రబలుతుందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి బ్లీచింగ్‌తో పాటు మందులు చల్లాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

తాగునీరు కలుషితం కాకుండా చర్యలు

చిల్లకూరు : గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు కలుషితం కాకుండా చూడాలని వరగలి పీహెచ్‌సీ వైద్యులు గీతామణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని అన్ని శాఖల అధికారులతో ఎంపీడీవో భానుమూర్తి పర్యవేక్షణలో సమీక్ష నిర్వహించారు. డాక్టర్ గీతామణి మాట్లాడుతూ తాగునీటి కలుషితం వల్ల వచ్చే డయేరియా నివారణపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఉన్న తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలని, నీటిని క్లోరినేషన్ చేయాలని సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా మందులు పిచికారీ చేయించాలని పేర్కొన్నారు. కొళాయిలు, బోర్ల వద్ద నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ నీటిని కాచ్చి చల్లార్చి తాగేలా అవగాహన కల్పించాలని వెల్లడించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఈవోపీఆర్‌డీ మాణిక్యం, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు, అన్ని పీహెచ్‌సీల వైద్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అవగాహన అవసరం

పెళ్లకూరు: వాతావరణంలో మార్పులు వల్ల వచ్చే సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో అన్నపూర్ణారావు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఇళ్ల మధ్య చెత్తాచెదారం నిల్వ లేకుండా శుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మురుగు కాలువలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్‌తోపాటు మందు చల్లించాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమలు వృద్ధిచెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్‌రావు, డాక్టర్ ఉమ, మండల వ్యవసాయ శాఖ అధికారి డాక్టర్ ప్రవీణ, ఎంఈవో శంకరయ్య, వివిధ శాఖల ఏఈలు ప్రకాష్, మహేష్ పాల్గొన్నారు.





సైదాపురం : మాట్లాడుతున్న ఎంపీడీవో సుధాకర్, బాలాయపల్లి: మాట్లాడుతున్న ఎంపీడీవో అరుణ



పెళ్లకూరు: మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీవో

సమస్యలపై తక్షణం స్పందించాలి



మాట్లాడుతున్న కమిషనర్ జనార్దన్ రెడ్డి

నాయుడుపేట టౌన్ : సచివాలయ ఉద్యోగులు తమ పరిధిలో నెలకొన్న ప్రజల సమస్యలపై తక్షణం స్పందించి పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. ఆయన సోమవారం 13 వార్డుల సచివాలయల ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండేలా ఆరోగ్య సిబ్బందితో కలిసి అవగాహన కల్పించాలన్నారు. డయేరియా ప్రబలకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని పేర్కొన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో మేనేజర్ ఎంకే ఖాజా మొహిద్దీన్, ఆర్‌ఐ షేక్ షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు



మాట్లాడుతున్న సెబ్, పోలీస్ ఇన్‌స్పెక్టర్‌లు

నాయుడుపేట టౌన్ : మాదకద్రవ్యాలకు బానిసలైతే జీవితాలు నాశనమవుతాయని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ అరుణ కుమారి, పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం ఎస్ఈబీ, పోలీసు అధికారుల సారథ్యంలో పట్టణంలోని శ్రీవేమ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఎస్ఈబీ, పోలీసు అధికారులు ప్రత్యేక నిఘా పెట్టినట్టు తెలిపారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తున్న, అక్రమంగా రవాణా చేస్తున్నా, నిల్వలు ఉన్నా వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్‌ఐ మునీర్, కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను బడికి పంపించండి



మాట్లాడుతున్న ఎంఈవో దయాకర్

సైదాపురం: బడిఈడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో దయాకర్ కోరారు. ఆయన సోమవారం స్థానిక స్త్రీశక్తి కార్యాలయంలో ఎంపీడీవో సుధాకర్ అధ్యక్షతన ప్రధానోపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు అన్ని వసతులు ఉన్నాయని తెలిపారు. నాణ్యమైన భోజనం పెడుతున్నట్టు పేర్కొన్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగు, షూష్ అందజేస్తున్నట్టు వివరించారు. ప్రతి గ్రామ స్థాయి అధికారి ఇంటింటికీ వెళ్లి బడి ఈడు పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నాలుగు అర్జీలు



పెళ్లకూరు: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న అధికారులు

పెళ్లకూరు: మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నాలుగు అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ ప్రసాద్‌రావు తెలిపారు. వివిధ ప్రాంతాల్లో నెలకొన్న భూసమస్యలపై బాధితులు అర్జీలు అందజేసినట్లు చెప్పారు. వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో అన్నపూర్ణారావు, ఎంఈవో శంకరయ్య, ఏవో ప్రవీణ, ఏపీఎం మునిరాజయ్య, ఆర్‌ఐ సంతోషిణిబాయి పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో సోమవారం ఎన్‌సీసీ వార్షిక శిక్షణా శిబిరంలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సామాజిక సేవా అంశంలో భాగంగా ఎన్‌సీసీ క్యాడెట్లు రక్తదానం చేశారు. నెల్లూరు సీఎస్సార్ ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ అనిత, వైద్య బృందం రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా క్యాంప్ కమాండెంట్ గణేష్ గొడంగవే మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న మరొకరి ప్రాణాలు కాపాడిన వారవుతామన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్‌రెడ్డి, నరేంద్రబాబు, కొండారెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



ఏపూరులో సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని ఏపూరు గ్రామంలో సోమవారం సీతారాముల కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు శ్రీరామ మందిరంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలు అలంకరించి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణం జరిపించారు. అనంతర అన్నదానం చేశారు. గ్రామస్తులు స్వామి, అమ్మవార్లకు కాయకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కారును ఢీకొన్న ట్రాలీ లారీ



రోడ్డుపై నిలిచిపోయిన కారు, లారీ

చిల్లకూరు : జాతీయ రహదారిలోని వరగలి క్రాస్ రోడ్డు సమీపంలో సోమవారం కారును ట్రాలీ లారీ ఢీకొంది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. స్థానికుల కథనం మేరకు.. నూజివీడుకు చెందిన ఏడుకొండలు కర్ణాటకలో ఆర్మీలో పనిచేస్తున్నాడు. ఆయన సెలవులపై సొంత ఊరికి వెళ్లేందుకు కుటుంబ సభ్యులను తీసుకుని కారులో బయలుదేరారు. వరగలి క్రాస్ రోడ్డు వద్ద వెనక వస్తున్న మరో కారు ఎడమ వైపు ఢీకొంది. దీంతో కారు అదుపుతప్పి డివైడర్‌పైకి ఎక్కింది. అదే సమయంలో చెన్నై నుంచి నెల్లూరు వైపు వేగంగా వస్తున్న ట్రాలీ లారీ ఢీకొంది. దీంతో చుట్టు పక్కల ఉన్న వారు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పెద్ద ప్రమాదం జరిగిందని భావించిన ట్రాలీ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి ఎలాంటి గాయాలు కాలేదు. సమీపంలోని రెవెన్యూ కార్యాలయంలో ఉన్న తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్‌ఐ రమ్యస్వాతి, వీఆర్వోలు అక్కడికి చేరుకుని పరిశీలించారు. పోలీసులు కూడా సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఇంత జరుగుతున్నా కనీసం ప్రమాదంపై టోల్ ప్లాజాలోని హైవే భద్రతా సిబ్బంది కన్నెత్తి చూడకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఐటీఐలలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లు

గూడూరు రూరల్ : పలు కంపెనీల ప్రతినిధులు నిర్వహిస్తున్న రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో పలువురికి ఉద్యోగాలు లభిస్తాయని నోడల్ అధికారి నాగరాజు తెలిపారు. గూడూరు రెండవ పట్టణంలోని ఐటీఐ కళాశాలలో సోమవారం రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారని పేర్కొన్నారు. ఇందులో సుమారు 180 మంది విద్యార్థులు పాల్గొన్నారని వెల్లడించారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యం



పిల్లల వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా వైద్యాధికారి శ్రీహరి

గూడూరు రూరల్ : గూడూరు మండలం చెన్నూరులోని గిరిజన గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటామని తిరుపతి జిల్లా వైద్యాధికారి శ్రీహరి తెలిపారు. చెన్నూరులోని గిరిజన గురుకుల పాఠశాలలో రెండు రోజుల క్రితం కలుషిత నీరుతాగి 8 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఇప్పటికే వారికి గూడూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందించారు. అలాగే చెన్నూరులోని ఆస్పత్రి వైద్యులు గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా వైద్యాధికారి శ్రీహరి సోమవారం గురుకుల పాఠశాలకు చేరుకుని విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. వార్డెన్‌తో మాట్లాడారు. వంట గదిలో ఆహార పదార్థాలను పరిశీలించారు. కూరగాయలు పాడైపోయిన విషయాన్ని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచి కూరగాయలు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని వార్డెన్‌ను ఆదేశించారు.

సూర్యప్రభపై శ్రీవారి వైభవం



గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో వారం రోజులుగా బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం శ్రీవారు సూర్యప్రభ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. స్వామి వారి ఉత్సవ మూర్తిని సూర్యప్రభపై కొలువుదీర్చి ఊరేగించారు. అనంతరం అర్చకులు స్వామి వారికి లక్ష్మీ సంవాదం, ముసుగుల సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా పట్టణానికి చెందిన పలువురు వ్యవహరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ ఈవో నవీన్‌కుమార్ పర్యవేక్షించారు.

గనుల భద్రతావారోత్సవాలు ప్రారంభం



తనిఖీలు చేస్తున్న అధికారులు

సైదాపురం: ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 50వ గనుల భద్రతావారోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మేనేజర్లు తమ సిబ్బందితో కలిసి మైకా మైన్లను తనిఖీ చేస్తారు. ఈ గనుల్లో కార్మికులకు అందించే భద్రత విషయాలపై పరిశీలిస్తారు. అనంతరం భద్రత ఉండే గనులను మొదటి, ద్వితీయ బహుమతులకు ఎంపిక చేస్తారు. భద్రతా వారోత్సవాల కమిటీ అధ్యక్షుడు గోగినేని భరత్ మాట్లాడుతూ ఈ ఏడాది 50వ భద్రతా వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. కమిటీ కార్యదర్శి వాసు ఆధ్వర్యంలో మైకా గనుల తనిఖీ మేనేజర్ల బృందం సోమవారం వసంత కళ్యాణ మైకామైన్, కళ్యాణ రామమైకామైన్ గనులను పరిశీలించారు. కార్యక్రమంలో మేనేజర్లు ప్రవీణ్, పురుషోత్తం, సాయి, శ్రావణ్, ప్రసాద్, కె.శ్రీనివాసులు, శివయ్య, రంగారెడ్డి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లలో ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులు పూర్తి



రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

– ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ.

వెంకటగిరి రూరల్ : డక్కిలి మండలంలోని ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులకు మళ్లీ రీ టెండర్లు పిలిచి రెండేళ్లలో పూర్తి చేస్తామని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి వ్యవసాయశాఖ కార్యాలయంలో సోమవారం రైతులకు రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని రైతులు, ప్రజలకు తాగు, సాగునీరు అందించడంపై ప్రత్యేక దృష్టిసారించినట్టు తెలిపారు. ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులను వేగవంతం చేసేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించనున్నట్టు తెలిపారు. అదేవిధంగా రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు సీఎం చంద్రబాబునాయుడు చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. అనంతరం రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తంబిరెడ్డి తనూజారెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్, టీడీపీ నేతలు ఏలేశ్వరం రామచంద్రమనాయుడు, పులుకొల్లు రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, గంగాధరం, చంద్రమౌళి, ఏడీఏ నాగార్జునసాగర్, ఏవో సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అర్జీలను సత్వరం పరిష్కరించాలి



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్న తహసీల్దార్ కల్యాణి

నాయుడుపేట టౌన్ : ప్రజలు అర్జీలను పరిశీలించి సత్వరం పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని తహసీల్దార్ కె.కల్యాణి ఆదేశించారు. ఆమె సోమవారం మీకోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ క్రమంలో చెరువు ఆక్రమణలకు సంబంధించి ఒక్క అర్జీ అందినట్లు డిప్యూటీ తహసీల్దార్ రాజేంద్ర వెల్లడించారు. ప్రతి సోమవా రం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

కండలేరులో 6.356 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 6.356 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 20, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు



విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేస్తున్న పద్మనాభం



నగదు పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

నాయుడుపేట టౌన్ : మండలంలోని అన్నమేడు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సోమవారం నగదు పురస్కారాలు అందజేశారు. హెచ్ఎం మధుసూదన రావు అధ్యక్షతన పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు దువ్వూరు కుమార్‌స్వామిరెడ్డి, చిగురువాడ పద్మనాభం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షల్లో 569 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన ఝాన్సీకి రూ.5 వేలు, 557 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన అస్మితకు రూ.3 వేలు, 551 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచిన యామినికి రూ.2 వేలు పంపిణీ చేశారు. పాఠశాల అభివృద్ధి కమిటీ ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలలో ప్రతిభ చూపుతున్న విద్యార్థులకు క్రమం తప్పకుండా నగదు పురస్కారాలు అందిస్తున్నారు. అదే విధంగా 500లకు పైగా మార్కులు సాధించిన 8 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున అందించారు. ఈ నగదును అన్నమేడు సర్పంచ్ జ్యోతి, విద్యా కమిటీ చైర్మన్ సుబ్రమణ్యం, మధు దాతృత్వంతో అందించినట్లు వెల్లడించారు. గణితంలో 100కు 100 మార్కులు సాధించిన ఝాన్సీకి గణిత ఉపాధ్యాయుడు చక్రవర్తి రూ.2 వేలు, సాంఘిక శాస్త్రంలో 99 మార్కులు సాధించిన విద్యార్థి శ్రావణ్‌కుమార్‌కు ఉపాధ్యాయిరాలు రేణుక రూ.2 వేలు ఇచ్చారు. కమిటీ సభ్యులను ఉపాధ్యాయులతో పాటు గ్రామ ప్రజలు అభినందించారు. అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసి కన్వీనర్‌గా వ్యవహరిస్తూ పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు చిగురువాడ పద్మనాభంను సన్మానించారు.